నేటి దినపత్రిక
# సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం | 29 జులై 2024 | పేజీలు 8

# ఫీజుల దోపిడీ !




- కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్ల దందా..
- అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం
- ఒక్కో విద్యార్థికి ఒక్కో ఫీజు
- కనిపించని ఫీజులు నోటీసు బోర్డు
- నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు

నెల్లూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:

జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లల్లో ఫీజుల దోపిడీకి అడ్డే లేకుండా పోయింది. నెల్లూరు జిల్లా కేంద్రంలో అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. నారాయణ, శ్రీ చైతన్య, రత్నం, షేడ్, ఇతాకా, రైన్ బో.. ఇలా చెప్పుకుంటూ పోతే వీధికో స్కూల్ ఉంది. నర్సరీకి వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. నర్సరీకి రూ.20 వేలు, ఎల్‌కేజీకి రూ.25 వేలు, యూకేజీకి రూ.30వేలు.. ఇవేకాక పుస్తకాలకు సంవత్సరానికి 5 నుంచి 7 వేలు, పిల్లలు ఒకటో తరగతికి వచ్చేసరికి లక్ష రూపాయలు కట్టాల్సిందే. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో విద్యాహక్కు చట్టం అమలు ఊసే లేదు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం పేదలకు సీట్ల కేటాయింపు ఉండాలి. ఫీజుల చెల్లింపు, ప్రవేశాల అమలు వంటి నిబంధనలు పాటించాలి. నిబంధనల్ని ప్రైవేటు స్కూళ్లన్నీ తప్పనిసరిగా పాటించాల్సి ఉంది. 25 శాతం సీట్లు పేదలకు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి, దివ్యాంగులకు ఉచితంగా కేటాయించాల్సి ఉంది. కానీ ఉచితం సంగతి పక్కన పెడితే కనీసం వెయ్యి రూపాయలు కూడా తగ్గించడం లేదు. విద్యా హక్కు చట్టం

-మిగతా 2లో

# అక్రమ లేఅవుట్ల వ్యవహారంలో.. అధికారుల చర్యలు నవ్వులపాలు


- హెచ్చరిక బోర్డులు నాటడం అధికారుల వంతు
- గంటల వ్యవధిలోనే పీకేయడం మావంతు అంటున్న లేఅవుట్ యజమానులు
- గత నాలుగు రోజులుగా ఇదే తంతు !

రాపూరు పంచాయితీ పరిధిలోని వెలుగొను టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం అక్రమ లేఅవుట్‌లని అధికారులు బోర్డులు పెట్టడం.. అవి కొన్ని గంటల వ్యవధిలోనే పీకేయడం .. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మరువక ముందే తాజాగా రాపూరు పంచాయతీ పరిధిలోని మల్లమ్మగుంట, మద్దెలమడుగు అక్రమ లేఅవుట్లకు నుడా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సచివాలయం కార్యదర్శులు, సిబ్బందితో కలిసి బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అధికారులు వెళ్లిన కొన్ని గంటల వ్యవధిలోనే లే అవుట్ యజమానులు బోర్డులు మాయం చేసేశారు.

రాపూరు, మేజర్‌న్యూస్ :

రాపూరు పంచాయతీ పరిధిలోని మల్లమ్మగుంట, మద్దెలమడుగు వెలుగోను మార్గంలోని జాతీయ రహదారి టోల్ గేట్ వద్ద వెలిసిన నాలుగు అక్ర మ లేఅవుట్లకు నుడా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సచివాలయం కార్యదర్శులు సిబ్బందితో కలిసి బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మలమ్మగుంటలోని సర్వే నెంబర్ 1104/1సీ, మద్దెలమడుగు గూడూరు మార్గంలోని సర్వేనెంబర్ 1054లోని

-మిగతా 2లో




# ఏకలవ్య పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- కొడవలూరు పరిధిలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలను పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి
- పాఠశాలలో వసతులపై ఆరా.. పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడి
- ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేస్తామని హామీ

2 లో



సమన్వయంతో వినాయక చవితి నిమజ్జన ఉత్సవాలను

# విజయవంతం చేయండి

అధికారులకు దిశానిర్దేశం చేసిన జాయింట్ కలెక్టర్ కార్తీక్



- ఇరుగాళమ్మ, గణేష్ ఘాట్, పెన్నానది ఘాట్ వద్ద పక్కాగా ఏర్పాట్లు
- నిమజ్జనం సాగే 8 మార్గాల్లో పటిష్ట బందోబస్తు
- భారీ క్రేన్లను నిమజ్జనానికి ఒదుబాటులో ఉంచండి
- సెప్టెంబర్ 5లోగా అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని నిర్వాహకులకు సూచన

నెల్లూరు, మేజర్‌న్యూస్ : వచ్చేనెల 7న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నగరంలో నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వినాయక చవితి నిమజ్జన ఉత్సవాల నిర్వహణపై జేసీ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనం సందర్భంగా నగరంలోని ఇరుగాళమ్మ గుడి వద్దనున్న గణేష్ ఘాట్, రంగనాయకులపేట వద్దనున్న పెన్నా ఘాట్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా జేసీ సమీక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో

-మిగతా 2లో



# ఏకలవ్య పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

## కొడవలూరు పరిధిలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలను పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గిరిజనాభివృద్ధికి ఎంతో ఊతమిచ్చే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ అన్నారు. బుధవారం కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన పరిశీలించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పాఠశాలకు చేరుకున్న ఎంపీకి స్థానిక నాయకులు, పాఠశాల ప్రిన్సిపల్ విశ్వప్రతాప్ శుక్లా, ట్రైబల్ వెల్ఫేర్ పీడీ పరిమళ, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అన్ని ప్రాంతాలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశీలించి డోర్లు లేక పోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్‌ను అడిగి వివరాలు ఆరా తీశారు. అలాగే తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తగినంత మంది సిబ్బంది లేకపోవడంపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. అలాగే ప్రయోగశాలలను పరిశీలించి ఏమేం వసతులు ఉన్నాయి, ఏం ఏర్పాటు చేయాలన్న దానిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాంగణంలో నిర్మించిన విద్యార్థుల భోజన శాల ప్రారంభానికి నోచుకోకపోవడంపై ఆరా తీశారు. భోజనశాలను త్వరలోనే ప్రారంభించి విద్యార్థుల ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఆగిపోయిన స్టేడియాన్ని పరిశీలించారు. బోధన, బోధనేతర సిబ్బంది నియామకంపై తప్పకుండా కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి జుయల్ ఓరమ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి జుయల్ ఓరమ్ సూచనలతో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నట్లు చెప్పారు. ఏకలవ్య మోడల్ పాఠశాల కేవలం పేరుకే పరిమితమైందని, తప్పకుండా ఈ పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. దాదాపు 20 ఎకరాల్లో ఈ పాఠశాల ఉన్నా, అన్ని వసతులున్నా.. సరి చేయాల్సిన విషయాలు చాలా ఉన్నాయని వివరించారు. ఇక్కడ ఉన్నవాళ్లలో చాలా మంది హిందీ మాట్లాడే సిబ్బంది ఉన్నారని, దాంతో విద్యార్థులు ఏం చెబుతున్నారో అర్థం చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తప్పకుండా తెలుగు తెలిసిన సిబ్బందినే నియమిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. దాంతో కమ్యూనికేషన్ కూడా సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై ఆరా తీశారు. అలాగే నూతనంగా నిర్మించిన డైనింగ్ హాలును త్వరలోనే ప్రారంభించి విద్యార్థుల అవస్థలను పరిష్కరిస్తామన్నారు. గిరినజాభివృద్దే ధ్యేయంగా ఎంతో ఉన్నత ఆశయాలతో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారని, తప్పకుండా ఈ పాఠశాలలో పూర్తిస్థాయి వసతులు కల్పించి గిరిజనుల ఉన్నతికి పాటుపడతామన్నారు. జిల్లాలోనే ఈ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేస్తామని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎంపీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ పీడీ పరిమళ, తహసీల్దారు స్ఫూర్తి, పాఠశాల ప్రిన్సిపల్ విశ్వ ప్రతాప్, టీడీపీ ముఖ్య నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కొడవలూరు మండల టీడీపీ ముఖ్య నాయకులు, అధ్యాపక సిబ్బంది, గెస్ట్ ఫ్యాకల్టీ, అధ్యాపకేతర సిబ్బంది, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శీనయ్య, సభ్యులు పద్మ, చెంచుకృష్ణ పాల్గొన్నారు.

### సమన్వయంతో వినాయక చవితి

# నిమజ్జన ఉత్సవాలను విజయవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)



ఇరుగాళమ్మ గుడి, పెన్నానది ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను అడిషనల్ కమిషనర్ శర్మద, ఈఈ చంద్రయ్య జేసీకి వివరించారు. ఘాట్ల వద్ద రూ.1.60 కోట్లతో సివిల్ వర్క్స్ చేపడుతున్నట్లు చెప్పారు. రెండు ఘాట్ల వద్ద రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు, తాగునీటి స్టాళ్ల ఏర్పాటు, బారికేడిరగ్, హైడ్రాలిక్ క్రేన్లు, గ్రానైట్ రిపేర్లు, రోడ్ల ప్యాచ్ వర్క్స్, మొబైల్ టాయిలెట్స్, ఎల్ఈడి లైటింగ్, ఫ్లడ్ లైట్లు, సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, పెయింటింగ్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం, సాంస్కృతిక కార్యక్రమాలకు స్టేజి నిర్మాణాలు మొదల్కైన ఏర్పాట్లను చేపడుతున్నట్లు కార్పొరేషన్ అధికారులు జేసీకి వివరించారు. అలాగే ఇరుగాళమ్మ గణేష్ ఘాట్ ప్రాంతాన్ని 6 జోన్లు, పెన్నా ఘాట్ ప్రాంతాన్ని 5 జోన్లుగా విభజించి మూడుషిఫ్టుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు ఈఈ చంద్రయ్య చెప్పారు.

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెల 7న వినాయకచవితి పర్వదినం మొదలుకానుందని, తొలిరోజు నుంచే ఘాట్ల వద్ద విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలన్నారు. వినాయక చవితి మొదలైన మొదటి రోజు 7వ తేదీ, మూడో రోజు 9వ తేదీ, ఐదో రోజు 11వ తేదీన సామూహిక నిమజ్జనం చేయడానికి ఎక్కువ సంఖ్యలో విగ్రహాలు వచ్చే అవకాశం వున్నందున అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎక్కువ కెపాసిటీ గల క్రేన్లను ఘాట్ల వద్ద అందుబాటులో వుంచాలని ఆదేశించారు. విగ్రహాల ఏర్పాటు, విద్యుత్, మైక్ పర్మిషన్లు ఎప్పటిలాగా ముందుగా తీసుకోవాలని, సెప్టెంబర్ 5వ తేదీలోగా అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇరుగాళమ్మ గుడి వద్దనున్న గణేష్ ఘాట్ వద్ద చెరువులో పూడికతీత పనులు పూర్తి చేయాలని, విగ్రహాలు మునిగేందుకు సరిపడ నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నిమజ్జనానికి విగ్రహాలు తరలించే 8 మార్గల్లో విద్యుత్ తీగలు విగ్రహాలకు అడ్డురాకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఘాట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను జేసీ ఆదేశించారు. ఘాట్ల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా గజ ఈతగాళ్లను, పడవలను అందుబాటులో ఉంచాలని ఫైర్, మత్స్యశాఖ అధికారులకు సూచించారు. నగరంలో విగ్రహాల నిమజ్జనం సమయంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఎఎస్పీలకు సూచించారు. ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని డిఎంఅండ్‌హెచ్‌వోకు సూచించారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సూచనలను కూడా జేసీ పరిగణలోనికి తీసుకుని, అందుకనుగుణంగా అధికారులకు ఆదేశాలిచ్చారు. సమావేశంలో ఎఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరెడ్డి, డిఆర్‌వో లవన్న, అడిషనల్ కమిషనర్ శర్మద, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, జడ్పీ సిఇవో కన్నమనాయుడు, ఆర్‌అండ్‌బి ఎస్ఈ గంగాధర్, కార్పొరేషన్ ఈఈ చంద్రయ్య, ఆర్డీవో మలోల, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పిట్టి సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి, ఎవిఆర్ మోహన్‌రావు, శ్రీకాంత్, బయ్యావాసు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీ !

(మొదటి పేజీ తరువాయి)




ప్రకారం ప్రతి స్కూలులో ఫీజుల వివరాలు బోర్డులో నమోదు చేయాలి. కానీ ఎక్కడా ఫీజులు వివరాలు కనిపించవు. ఒక్కో విద్యా ర్థికి ఒక్కో ఫీజు చెప్పి నిలువునా దోచుకుంటున్నారు. జాయిన్ అయ్యే వరకు వెంటపడడం.. తర్వాత ఫీజులు చెల్లించకుంటే విద్యార్థులను వేధించడం పరిపాటిగా మారింది. నెలకు ఒక పరీక్ష పెడతారు. ఫీజు కట్టిన వారికే హాల్ టికెట్ ఇస్తామని.. ఫీజులు చెల్లించని విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారు. నువ్వు ఫీజు కట్టలేదు. ఫీజు కడితే హాల్ టికెట్ ఇస్తామని తల్లి దండ్రులకు చెప్పి పంపిస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీకి కూడా హాల్ టికెట్ అని చెప్పి ఫీజులు గుంజుతున్నారంటే.. ప్రైవేట్ స్కూల్ దోపిడీ ఏస్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇంత దోపిడీ జరుగుతున్నా.. విద్యాశాఖ అధికారులు సంవత్సరానికి ఒకే సారి కూడా తనిఖీలు చేయరు. డబ్బులు ఉన్నవాళ్లకే చదువులు అనే చందంగా మారింది ప్రస్తుత విద్య పరిస్థితి.




### అక్రమ లే అవుట్‌ల వ్యవహారంలో

# అధికారుల చర్యలు నవ్వులపాలు

(మొదటి పేజీ తరువాయి)





స్థలాల్లో నుడా అనుమతి లేకుండా అక్రమంగా ప్లాట్లు వేశారని అధికారులు తెలిపారు. వీటిలో ఎవరైనా కొనుగోలు చేస్తే చట్ట విరుద్ధమని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్లు, భవన నిర్మాణ అనుమతులు తమ అనుమతి పొందే వరకు చేయకూడదని పేర్కొన్నారు. జిల్లా పంచాయితీ అధికారి (డీపీవో), నుడా వైస్ ఛైర్మన్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అనుమతులు లేవని బోర్డులు ఏర్పాటు చేస్తే.. అధికారులను బెదిరిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా.. తలొగ్గేది లేదని, అనుమతులు ఉంటే తప్పా.. అనుమతులు లేకుండా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో లే అవుట్‌లు వేస్తే చర్యలు తప్పవని, దీనిపై కఠినంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రెండు, మూడు సచివాలయ కార్యదర్శిలు అశోక్, పావని, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా.. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు లేఅవుట్ యజమానులు తీసేయడంపై **'మేజర్‌న్యూస్ ప్రతినిధి'** ఫోన్ ద్వారా డీపీఓ సుస్మితారెడ్డిని సంప్రదించగా.. నాలుగు అక్రమ లేఅవుట్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, వాటిని తొలగిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని డీపీఓ సుస్మితారెడ్డి తెలిపారు.

### వివాహ మహోత్సవానికి

# మాజీ మంత్రి కాకాణి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వివాహ మహోత్సవానికి బుధవారం హాజరయ్యారు. మండల కేంద్రంలోని బోడిస్వామి కండ్రిగ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి, మండల వైసీపీ యువజన విభాగం నాయకులు సీపారెడ్డి జానకిరామిరెడ్డి, మాజీ జెడ్పీటిసి శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నబజార్ ఎస్ఐగా అయ్యప్ప

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా అయ్యప్పను నియమిస్తూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా నెల్లూరు వీఆర్‌లో ఉన్న సుమన్‌ను కలువాయి పోలీస్ స్టేషన్‌కు నియమించారు. బదిలీ అయిన ఇద్దరు ఎస్ఐలు తక్షణం బాధ్యతలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు.

# లీకేజీ శాపమై.. రహదారి ఛిద్రమై

- ఆశ్రమం వద్ద ప్రమాద ఘంటికలు
- కోతకు గురైన ప్రధాన మార్గం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం సోమశిల ప్రాజెక్టు సమీపానగల పరమానందయ్య ఆశ్రమం వద్ద లీకేజీ నీటి వరవడితో ప్రధాన రహదారి మార్గం కోతకు గురి అయింది. కండలేరుకు తెలుగంగ కెనాల్ ద్వారా నీటిని పంపిణీ చేస్తున్న విషయం విధితమే. తొలుత రెండువేల క్యూసిక్కుల నీటిని విడుదల చేపట్టారు. అయితే ఈ క్రమంలో సిపేజీ రూపేనా లీకేజీగా మారిన నీరు ఆశ్రమం వద్ద ప్రధాన రహదారి దిగువ భాగాన్ని కోతకు గురిచేసింది. నీరు పెన్నా ఏటిలోకి పోయే క్రమంలో తూముల నుండి పోవాల్సి ఉండగా దిశను మార్చుకొని ప్రవహించడంతో ఆ ప్రాంతం ప్రస్తుతం వాహన రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగించాయి. 2000 క్యూసిక్కుల నీటి విడుదల కొంత దెబ్బతిన్నగా ప్రస్తుతం 3000 క్యూసుక్కుల నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో కోత మరింతగా విస్తరించింది భాగంగా రహదారి ఏ క్షణంలోనైనా కూలెందుకు సిద్ధంగా ఉంది. గతంలో ఈ లీకేజీ నీరు కాలువ కింద ఉన్న పొలాలను ముంచెత్తేది. అయితే రైతుల ఇబ్బంది దృష్ట్యా అధికారులు అనాలోచితంగా ఆ నీటిని ఈ కాలువకు మళ్లించారు. కాలువ లైనింగ్ కాలం చెల్లి బలహీనంగా ఉంది. గతంలో ఈ కాలువ నిర్మాణ పనులు ఆది నుంచి నాణ్యత లేమితో నాసిరకంగా నిర్మించారు అని ప్రస్తుత ఈ పరిస్థితికి కారణమైందని అధికారులు సైతం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ దుస్థితితో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ప్రాజెక్టు సిబ్బంది దెబ్బతిన్న ప్రాంతానికి ఇరుపక్కల భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలు కూడా అతి కష్టం మీద ఆ ప్రాంతం గుండా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.ఇక మూగజీవాలు కూడా కోతకు గురైన రహదారిపై సంచరిస్తూ ఉంటున్నాయి. ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతంలో పక్కా నియంత్రణ, పర్యవేక్షణ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.అయితే ఆ పరిస్థితి కానరావడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.ఏదైనా అనుకోని విపత్తు జరగక మునుపే యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.



# వీఎస్‌యూలో తెలుగు భాషా వైభవం..

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, తిక్కనసాహితీ పీఠం తెలుగు శాఖ వారు వ్యావహారిక భాషకి గిడుగు వారు చేసిన సేవను స్మరిస్తూ, రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహణలో భాగంగా బుధవారం భారతీయ జ్ఞాన వ్యవస్థ (ఐకేఎస్) ప్రధాన అంశంగా తీసుకుని ప్రారంభ సమావేశం జరపడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి మాట్లాడుతూ.. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలియజేశారు. ఈ తెలుగు భాష అపారమైన సేవ చేసిన గిడుగు వారి జయంతి ఘనంగా జాతీయ సదస్సు రెండవ రోజు 29.08.2024న నిర్వహించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదాలలో విజ్ఞానం అనే అంశంపై బత్తిన సాయికుమార్ రెడ్డి అన్నమయ్య జానపద గేయాల్లో జాన పద వైభవం అనే అంశంపై విద్వాన్ వీవీఎస్ వినోద్ కుమార్ అన్నమయ్య కీర్తనలను పాడివినిపించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ విజయ తెలుగు శాఖఅధిపతి డాక్టర్ ఎం.త్యాగరాజు విశ్వవిద్యాలయ ఆచార్యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## నేడు జిల్లా క్రీడా ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం

**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్చంద్ జన్మదిన పురస్కరించుకొని బుధవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2023 - 2024 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో క్రీడలలో ప్రతిభ కనబరిచిన పాఠశాలలో జిల్లా స్థాయిలో ఐదు పాఠశాలను ఎంపిక చేశారని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నగరంలోని కేవిఆర్ మున్సిపల్ పాఠశాల బివి నగర్, జెడ్పీహెచ్ఎస్ స్కూల్ పాటూరు.కోవూరు, బివిఎస్ గర్ల్స్ హై స్కూల్ నవాబ్ పేట నెల్లూరు, జడ్పీ గర్ల్స్ స్కూల్ కోవూరు, జడ్పీహెచ్ఎస్ స్కూల్ మహమ్మదాపురం, పాఠశాలలు ఎంపిక చేయబడ్డాయని, క్రీడా ప్రతిభా పురస్కాలను సాధించిన పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ తప్పనిసరిగా గురువారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల దర్గా మిట్ట నందు ఉదయం తొమ్మిది గంటలకు జరిగే క్రీడా ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎం విజయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## దేవాలయాల కమిటీల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

**నెల్లూరు (కల్చరల్), మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం నెల్లూరు రూరల్ ప్రాంతాల్లోని పలు దేవాలయాల ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు దేవాలయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నగరంలోని మూలపేటలో వెలసిన గ్రామ దేవత శ్రీ ఎరుకల పరమేశ్వరి ఆలయానికి, నెల్లూరు నగరం దర్గా మెట్ట వెలసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరి ఆలయానికి, నెల్లూరు రూరల్ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ధర్మకర్తల మండళ్ళకు ఆసక్తి ఉన్న ఆధ్యాత్మిక సేవాభావం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించుతున్నట్లు ఆయా ఆలయాల ఇన్చార్జిలకు సమాచారం అందజేశామని ఈ దరఖాస్తులు సెప్టెంబర్ 11వ తేదీలోగా గుంటూరు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయం పంపాలని ఆయన ప్రకటనలో కోరారు.

## 12 డిమాండ్లపై ఏపీ జెన్కో వద్ద ఆందోళన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** 12 డిమాండ్లపై వచ్చేనెల 5వ తారీఖున ఏపీ జెన్కో థర్మల్ కేంద్రం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సిఐటియు నాయకులు అన్నారు. బుధవారం కార్మిక సంఘాలు సమావేశం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. జెన్కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలను అరికట్టాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేలటూరు ఏపీ జెన్కోలో నెలకొని ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహా ధర్నా చేస్తున్నామని సిఐటియు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో ప్రమాదాలపై సమగ్ర విచారణ జరగాలి

- అధికార పార్టీ నాయకులు తిన్నెలపూడి సిద్దు డిమాండ్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు కేసులు నమోదు చేయడం, అదేవిధంగా సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని, అలా కాకుండా మౌనం వస్తే ప్రమాదమని అధికార పార్టీ నాయకులు తిన్నెల పూడి సిద్దు అన్నారు. బుధవారం ఆయన తన నివాసం నందు విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు సంబంధిత శాఖల అధికారులు నివేదికలు తయారు చేయడం లేదని విమర్శించారు. ఆయిల్ ఉత్పత్తి కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంపై ఇప్పటివరకు వాస్తవాలు బయటకు రాలేదని దీని వెనక ఉన్న ఆంతర్యం ఏమిటని అధికార పార్టీ నాయకులు ప్రశ్నించారు.

## శ్రీకృష్ణ మందిరంలో అన్నదానం



**నెల్లూరు (కల్చరల్), మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని భక్తవత్సల నగర్‌లోని శ్రీ రుక్మిణి సత్యభామ శ్రీకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 2 వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాకులు అనంగి రమణయ్య, పెద్దరోశయ్య, చిన్న రోశయ్య లు తెలిపారు.

## కళాశాల విద్యార్థులకు రైస్ బ్యాగులు వితరణ

**బోగోలు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు బోగిరి మణమ్మ, ఆరిఫ్ జమీన్ రైతు వారి జ్ఞాపకార్థకంగా విద్యార్థులకు నెలకు సరిపడా రైస్ బ్యాగులను కూరగాయలను కళాశాల యాజమాన్యానికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, కావ్య యువసేన సభ్యులు బోగిరి ప్రభాకర్, గోచిపాతల సంజయ్, సయ్యద్ సుభాని బాషా, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉధృతం అవుతున్న ఏపీ జెన్కో రైతు ఉద్యమం

▶ నష్టపరిహారం, ప్యాకేజి కోసం సదస్సులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఏపీ జెన్కో ధర్మల్ విద్యుత్ కేంద్రం బూడిదగుంట తెగిపోయిన కారణంగా నష్టపోయిన రైతాంగానికి అదేవిధంగా ప్రజలకు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ చేస్తున్న పోరాటం అదేవిధంగా రైతుల ఉద్యమం రోజురోజుకు ఉధృతం అవుతూ ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం ముసునూరు వారి పాలెం జడ్పీ హైస్కూల్ నందు సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సదస్సు జరిగింది. రైతాంగానికి ఎకరాకు మూడు లక్షలు, ప్రజలకు 25000 ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. సదస్సుకు అధ్యక్షత అంకయ్య అధ్యక్షుడించారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని అదే విధంగా వచ్చే నెల 12వ తేదీన ఏపీ జెన్కో గెట్ వద్ద ముట్టడి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ రాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, హైకోర్టు అడ్వకేట్ విజయనిర్మల, టీపీ గూడూరు మండలం సిఐటియు నాయకులు వేగురు వెంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు కాల్తిరెడ్డి రమణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాధయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి బ్రహ్మ దేవి మోహన్ రావు, ఏపీ జెన్కో యాష్ పాండ్ బాధితుల కన్వీనర్ కుడుముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీటీ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌కు పరామర్శ




**నెల్లూరు (వైద్యం), మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌ను నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి సూచనల మేరకు బుధవారం నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు. ఈ మేరకు ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌ను పరామర్శించి ఆరోగ్యం విషయాలను అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆయురారోగ్యాలతో త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఆశాభవం వ్యక్తం చేయడం జరిగిందని ఈ సందర్భంగా మహమ్మద్ ఖలీల్ అహ్మద్ కు నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలియజేశారు. మంగళవారం రాత్రి ఖలీల్ అహ్మద్ గుండెపోటుతో మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. నగర వైసీపీ ఇన్‌చార్జ్ మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌ను పరామర్శించిన వారిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాశం శ్రీనివాస్, యేసు నాయుడు, సీహెచ్ సూరిబాబు, మొయినుద్దిన్, షేక్ హాలీం, షేక్ ఖలీల్ తదితరులు ఉన్నారు.

# స్వీయ మదింపు పరీక్షలను పరిశీలించిన ఎంఈఓ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో బుధవారం నుంచి ప్రారంభమైన స్వీయ ముదింపు పరీక్షలను ఉదయగిరి ఎంఈఓ-1 షేక్ మస్తాన్ వలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గన్నేపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గడ్డంవారిపల్లి పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసి స్వీయ మదింపు పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వీయ మదింపు పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని, 1,2 తరగతులు అభ్యసించే విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను ఉపాధ్యాయులు భర్తీ చేయవలెనని అదేవిధంగా 3 నుండి 8తరగతులు అభ్యసించే విద్యార్థులు ఓఎంఆర్ షీట్లను ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా భర్తీ చేసే విధంగా ఉపాధ్యాయులు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని తెలియజేశారు. ఉన్నత పాఠశాల గడ్డంవారిపల్లిలో మనబడి మన భవిష్యత్తు పనులలో భాగంగా నిర్మించిన నూతన టాయిలెట్లను, ఎఫ్ఏ-1 పరీక్షలను,



స్టడీ అవర్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎస్ఐకి ఘన సన్మానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపర్చి స్వాతంత్ర్యం దినోత్సవం సంధర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిని బుధవారం స్థానిక పోలీస్టేషన్లో టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు, పలువురు నాయకులు ఘనంగా సన్మానించి మిఠాయిల అందజేశారు. ఈ కార్యక్రమంలో గానుగపెంట ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి బుధ, శని వారాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక : గనుకుల కిషోర్




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయం గోమతి నగర్‌లో బుదవారం ఉదయం 11గంటల నుండి జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సూచనలతో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుండి అనేక మంది ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలను పరిశీలించి పరిష్కార మార్గాలను చూపే విధంగా పార్టీ పెద్దలు చర్యలు తీసుకుంటారన్నారు. జనసేన నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, జమీర్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీపతి, రాము, సుభాషిని, ప్రసన్న, నందిని తదితరులు అర్జీలు స్వీకరించారు.

## కళాశాల విద్యార్థులకు రైస్ బ్యాగులు వితరణ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు బోగిరి మణమ్మ, ఆరిఫ్ జమీన్ రైతు వారి జ్ఞాపకార్ధకంగా విద్యార్థులకు నెలకు సరిపడా రైస్ బ్యాగులను కూరగాయలను కళాశాల యాజమాన్యానికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, కావ్య యువసేన సభ్యులు బోగిరి ప్రభాకర్, గోచిపాతల సంజయ్, సయ్యద్ సుభాని బాషా, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ పేట ఎస్ఐగా సైదులు బాధ్యతలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండల నూతన ఎస్ఐగా ఎ.సైదులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఏఎస్ పేటకు నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ రెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సైదులు అనంతరం స్థానికంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజ్రత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ వారి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రం ఉన్న ఇక్కడ ఎస్ఐగా రావడం ఎంతో ఆనందంగా ఉందని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు తమ సహాయ సహకారాలు అందించాలని ముఖ్యంగా దర్గా సెంటర్లో ట్రాఫిక్ పై దృష్టి పెడతానని అలాగే దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నివేళ పోలీస్ రౌండ్స్ నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు లా అండ్ ఆర్డర్ పరంగా ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తేవాలని చట్టాన్ని ఎవరు ఉల్లంఘించరాదన్నారు. నూతన ఎస్ఐను స్థానిక పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలుకుతూ అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

# దుర్గంపై వనభోజనాలు

▶ వైభవంగా జట్పట్ బీబీ గంధ మహోత్సవం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి దుర్గంపై బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. మొహరం మాసంలో వచ్చే చివరి బుదవారం (ఆబ్రాన్యుంబా) రోజున ముస్లిం సోదరులు కుటుంబ సమేతంగా వనభోజనాలకు వెళ్లి పచ్చికబయళ్లు తొక్కితే పాపాలు హరించి పుణ్యం లభిస్తుందని వారి విశ్వాసం. అందులో భాగంగా ఉదయగిరి దుర్గంపై పట్టణంతోపాటు వింజమూరు, పామూరు, నెల్లూరు, బద్వేల్, కావలి, ఆత్మకూరు తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చి తొట్టి లొద్ది ప్రాంతంలో సేదతీరి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం దుర్గంపై గల పురాతన కట్టడాలను తిలకించారు. అలాగే దుర్గంపై గల జట్పటి బీబీ దర్గాలో గంధమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, పకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ గంధాన్ని హక్కుదారుల ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గుడాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కావ్య

## త్వరలో సీఎం చేతులు మీదుగా ప్రతి ఇంటికి అమృతం పథకాన్ని అందించేందుకు సన్నాహాలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో రోజు రోజుకీ అభివృద్ధి పనులు శరవేగంగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నిర్వహిస్తున్నారు. బుధవారం కావలి పట్టణంలోని పాతూర్‌లో ఎంపీ నిధులతో ప్రజా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 9.5 లక్షల ఖర్చుతో రెండు సిమెంట్ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాంరెడ్డి వారి వీధిలో నాలుగు పాయింట్ రూ.5లక్షల వ్యయంతో కాటా వారి వీధిలో రూ.5లక్షల వ్యయంతో బుధవారం శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. కావలి పట్టణ అభివృద్ధి కోసం రూ.10 కోట్లతో డిపిఆర్ తయారుచేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, త్వరలోనే మిగిలిన పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి నిర్వహించే లక్ష్యంతో 62 కోట్లతో అమృత పథకం ప్రారంభించిన పనులను పూర్తి కానున్నాయని తెలిపారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అలాగే కావలి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో 73 లక్షలతో కంప చెట్లను అలాగే డ్రైనేజీలను పూడిక తీయించడం ఇప్పటికే మున్సిపాలిటీ వారు నిర్వహించారని, ట్రంక్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎంజీఆర్ కళ్యాణ మండపం నుండి మద్దురుపాడు వరకు నాలుగు లైన్ల పనులు ప్రారంభం అయ్యాయని, బృందావనం కాలనీ నుండి ముసునూరు వరకు పనులు త్వరలో ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. అలాగే సెప్టెంబర్ ఒకటో తేదీన తుమ్మలపెంట రోడ్డు ముహూర్తం ప్రారంభమవుతుందని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈ గిరిధర్, డిఈ విజయలక్ష్మి, మున్సిపల్ డిఈ సాయిరాం, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య స్థానిక వార్డు నాయకులు చిలకపాటి శ్రీనివాసులు జనిగర్ల మనోహర్, బొంత శీను టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీఎస్పీ, రూరల్ సీఐతో కలిసి అవగాహన కార్యక్రమం

**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ముసునూరులో బుధవారం ముసునూరు గ్రామ ప్రజలకు వివిధ కార్యక్రమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. అలాగే రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. యువతీ యువకులు చెడు మార్గంలో జీవించకుండా చెడు అలవాట్లకు లోనవ్వకుండా మంచి ప్రవర్తన కలిగి సమాజంలో జీవించాలని, అలాగే చెడు అలవాట్లకు గురికాకుండా ఒకరి మీద ఒకరు పగలు పెంచుకొని చివరికి వారి జీవితాలు కటకటాలు పాలు కాకుండా సమాజంలోమంచి ప్రవర్తన కలిగి వారి కుటుంబాలు సంతోషంగా ఉండాలని అలాగే యువత అనుకుంటే ఏదైనా సాధించవచ్చునని యువత మంచి మీద దృష్టి పెట్టి మంచి కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ పెద్ద బొట్లగుంట శ్రీహరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.






# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు నుండి చిట్వేల్ వెళ్ళు ఘాట్ రోడ్డు మార్గంలో 5వ కిలోమీటర్ వద్ద కారు బైక్ ఢీ కొన్న ప్రమాదం లో ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న వెంకటాచలం మండలం, పొలిచెర్లపాడు గ్రామానికి చెందిన వెంకటరత్నయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాపూరు సీఐ టి.విజయ కృష్ణ, ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకటేశ్వర రావు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

# దాతల సహకారం మరువలేనిది



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న చేయూత మరువలేనిదని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టేజీ, ముఖద్వారం ఏర్పాటుకు దాతలతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేజీ నిర్మాణానికి మూలె రాజశేఖరరెడ్డి, ముట్టుకుందు ప్రభాకర్ రెడ్డి, ముఖద్వారం నిర్మాణానికి కల్లూరి సిద్ధారెడ్డి జ్ఞాపకార్థం రవీంద్రరెడ్డిలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా మూలె రాజశేఖర్రెడ్డి, ప్రత్యూషల వివాహం సందర్భంగా విద్యార్థులకు అతిథి భోజనం అందించారు. అలాగే మండలంలోని గడ్డంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత. గన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న స్వీయమదింపు పరీక్షలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయబ్, మాలకొండయ్య, సర్పంచ్ లక్కు రమణమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ కవిత, సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ కాలువ పూడికతీత పనులు పరిశీలన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్, ఉయ్యాల కాలువలో కాలువ పూడికతీత పనులను నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నిరంతరం కాలువ పూడికతీత పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత స్థానిక నాయకులపైన కూడా ఉందని, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగానే డ్రైనేజీ కాలువ పూడికతీతలు తీస్తున్నారన్నారు. అయితే స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో బాధ్యత తీసుకొని చెత్తను కాలవలో వేయకుండా పరిశుభ్రంగా ఉంచాలని, నగర ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బంది లేకుండా డ్రైనేజీ కాలువల్లో పూడికతీతల పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ఉచూరు సురేష్, వెంకటేశ్వర్లు ఆచారి, ఈశ్వర్, వీరాచారి, కొండిశెట్టి సతీష్, సుధాకర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, అశోక్, నాని, మధు, బాలాజీ రెడ్డి, కమలాకర్, శివ, గౌసియా, విజయలక్ష్మి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

# సాగర పోలీస్ స్టేషన్ తనిఖీ : సీఐ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరంలోని పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగాధర్ రావు సందర్శించారు. సీఐగా బాధ్యతలు చేపట్టాక సాధారణ స్టేషన్ల స్థితిగతులపై సమీక్షించే కార్యక్రమంలో భాగంగా ఆయన విచ్చేశారు. పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీస్ వాతావరణ ఉండేలా చూడాలని సూచించారు. మండలంలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచాలి అన్నారు. రాబోవు వినాయక చవితి సందర్భంగా ఏర్పాట్లకై అనుమతులు తప్పనిసరి అన్నారు. సౌండ్ పొల్యూషన్ లేకుండా పండుగను మంచి ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని మండల ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సూర్యప్రకాశ్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# మర్రిపాడు అధికారులకు ఆత్మీయ సన్మానం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండల తహసిల్దార్‌గా, ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు టీడీపీ నాయకులు బుధవారం ఆత్మీయంగా కలిసి సన్మానం చేశారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కే.శ్రీనివాస రావు, తహసిల్దార్ స్వప్నను మండల టీడీపీ మండల అధ్యక్షులు అరికట్ల జనార్ధన్ నాయుడు మాజీ మండల అధ్యక్షులు శాఖమూరి నారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు పావులూరి వెంకటరామయ్య, టీడీపీ జిల్లా నాయకులు గాలిబోయిన లక్ష్మీనరసయ్య, కిష్టపాటి మధుసూదన్ రావు, కర్రావుల శ్రీనివాసులు, కొండారెడ్డి, ఎలాగాల వెంకటేశ్వర్లు, సాతాన శీను, రవి మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషి చేయాలంటూ కోరారు. పార్టీలకు అతీతంగా పనిచేసే మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు నెరవేర్చేందుకు కృషి చేయాలని విన్నవించుకున్నారు. అందుకు సమాధానంగా ఎస్సై శాంతి భద్రతలను కాపాడుతానని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని వారి ముందు హామీ ఇచ్చారు.

# విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి




**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** పాఠశాలల్లో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా పరిశుభ్రత కార్యక్రమల అమలు తప్పనిసరి అని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్ బాబు అన్నారు. సార్ట్, గ్రామాలయ ఆధ్వర్యంలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా నెల్లూరు మండలంలోని ఎన్నిక చేయబడిన పాఠశాలల ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దర్గామిట్ట నందు ఒకరోజు హ్యాండ్ వాష్ మీద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తి గత పరిశుభ్రత, ఆరోగ్యంపై దృష్టి సారించాలనీ బాత్రూం, మరుగుదొడ్లు, ప్రతీరోజూ 2సార్లు ఆయాలచే శుభ్రం చేయించాలని, అవి అపరి శుభ్రంగా వుంటే విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై పడే ప్రమాదముందన్నారు. ప్రతీ రోజూ భోజనానికి ముందు, టాయిలెట్‌కి తర్వాత డెటాల్ లేదా సబ్బుతో చేతులు కాళ్ళు శుభ్రం చేసుకోవాలి. చేతులు శుభ్ర పరచే 6 రకాల విధానాలు తెలియజేశారు. అనంతరం మండల అర్బన్ విద్యాశాఖ అధికారి-2 సయ్యద్ హమీద్ అమీర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పాఠశాలను తమ స్వంతంగా భావించి విద్యార్థులను తమ స్వంత పిల్లలుగా భావించాలని, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతుండాలనీ తెలిపారు. మండల రూరల్ విద్యాశాఖ అధికారి-2 మురళీధర్ మాట్లాడుతూ.. పాఠశాలలలో ఈ స్వచ్ఛతా కార్యక్రమం నిరంతరం అమలయ్యేలా చూడాలన్నారు. డిబిఎస్ఐ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ కుమారి కార్యక్రమం విధివిధానాలు గురించి వివరిస్తూ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా గోదే ప్రసాద్ వ్యవహరించారు. డిజిటల్ స్క్రీన్ పై హ్యాండ్ వాష్ గురించి, ప్రోగ్రాం ఆవశ్యకత గురించి వివరించటం జరిగింది. 54 పాఠశాలలకు సంబంధించి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ముఖ్యఅతిథులు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో డిబిఎస్ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, వలంటీర్లు ఈశ్వరయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకయ్యస్వామి కుటుంబీకులపై ఈఓ దురుసు ప్రవర్తన

▶ సోంపల్లి పెంచలయ్య వెల్లడి



**నెల్లూరు బర్సస్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా, వెంకటాచలం మండలం, గొలగమూడి గ్రామంలో వెలసిఉన్న భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో జరిగిన 42వ ఆరాధన మహోత్సవ కార్యక్రమంలో వెంకయ్య స్వామి వారి కుటుంబ సభ్యులైన సోంపల్లి పెంచలయ్య, వారి కుటుంబ సభ్యులపై ఆలయ ఈఓ. బాలసుబ్రహ్మణ్యం దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బుధవారం నెల్లూరు జర్నలిస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈవో బాలసుబ్రమణ్యం తమపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. వెంకయ్య స్వామి సమాధి చేసే సందర్భంలో మా కుటుంబ సభ్యులు ఎవరు మా స్వగ్రామం నుండి రాలేదని ఆరోపించారు. స్వామి కుటుంబ సభ్యులచే సమాధి చేయలేదని కల్పిత మాటలు చెప్పి తమ కుటుంబ సభ్యులను మనోవేదనకు గురి చేశారు. ఇవన్నీ తన అధికారం నిలుపుకునేందుకు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. స్వామి వారి సేవకు తమను దూరం చేయాలని భావిస్తున్నట్లు మా గ్రామస్తులు కొందరు మాతో చెప్పడం జరిగినది. తాము ఎల్లప్పుడూ స్వామి వారి సేవలోనే ఉండేవారుమని తెలియజేశారు. ఆలయంపై మాకుఎలాంటి దురదేశం లేదని ఈవో స్వామి వారి కుటుంబ సభ్యుల పై చేసిన ఆరోపణలు వాస్తవం కాదని రుజువులతో సహా నిరూపిస్తామన్నారు. ఈ సమావేశంలో సోంపల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్ర వోల్వా బస్సును ఢీ కొట్టిన టిప్పర్

▶ పలువురికి గాయాలు



**నెల్లూరు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని కెవిఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఏపీఎస్ఆర్టీసీ వోల్వా బస్సును అతివేగంతో వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నెల్లూరు నగరంలో అర్ధరాత్రి దాటాక ఇసుక, గ్రావెల్ టిప్పర్లు, లారీలలో అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతుంది. ఈ క్రమంలో పట్టించుకునే అధికారులు లేకపోవడంతో గ్రావెల్ మాఫియా వారి వాహనాలను అతివేగంతో ఢీకొంటున్నాయి. ఆర్టీసీ బస్సును కూడా అతివేగంతో ఢీకొనడంతో డ్రైవర్‌తోపాటు 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ఐని సత్కరించిన టీడీపీ నాయకులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును సింగనపల్లి పంచాయతీ టీడీపీ నాయకులు ఆవులపోలు ప్రసాద్ యాదవ్, నల్లనూకల వెంకటసుబ్బయ్య యాదవ్ల తోటి టీడీపీ నాయకులు కార్యకర్తలతో ఆత్మీయంగా కలిసి బుధవారం శాలువాను కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు మండలంలో శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. పార్టీలకు అతీతంగా పని చేయడం తోపాటు మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి న్యాయ అన్యాయాలను గమనించి భద్రత కల్పించాలని కోరారు. అందుకు ఆయన ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు.

## ఆధార్ కార్డు లేని గిరిజన కుటుంబాలు నమోదు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పైనం పురం గ్రామపంచాయతీ గిరిజన కాలనీల్లో ఆధార్ కార్డు లేని గిరిజన కుటుంబాలపై సర్వే ప్రక్రియ బుధవారం జరిగింది. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సర్వే చేశారు. పంచాయతీ అధికారులు సహకారం అందించారు. ఈ నేపథ్యంలో పలువురికి ఆధార్ కార్డులు లేవని అధికారులు గుర్తించి పేర్లు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి కుటుంబం ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని విషయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ దేవరపాలెం గ్రామపంచాయతీలోని ప్రభుత్వ ఎస్టీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వసతి గృహంలోని విద్యార్థులకు సరైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని వారి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సౌత్ మోపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హర్షద్ హుస్సేన్, హెల్త్ అసిస్టెంట్ ఖాదర్ మస్తాన్, ఎంఎల్‌హెచ్‌పి జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు మోక్షంలేదా..



నువ్వురుపాడు అరుంధతీయవాడలో నాలుగేళ్ళుగా నిర్మాణం నిలిచిపోయి దర్శనమిస్తున్న అంగన్‌వాడీభవనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో నిధులకొరత అని, ఇతరత్రా కారణాలని అనేక భవనాలు నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోయి దర్శనమిస్తుండడం, పూర్తియిన భవనాలు వివిద కారణాలతో వినియోగంలో లేకుండా నిరుపయోగంగా దర్శనమిస్తుండడం అనాదిగా ఆనవాయితీగా ఉంది. మండలంలోని నువ్వురుపాడు అరుందతీయకాలనీలో గత నాలుగేళ్లుగా ముళ్ళ చెట్ల మద్య ఒక అర్ధాంతరనిర్మాణ భవనం కన్పిస్తుంటుంది. అది అంగన్‌వాడీ భవనమని, శ్లాబ్‌లెవల్ వరకు నిర్మించి వదిలేశారని కాలనీ వాసులు తెలిపారు. నువ్వురుపాడు, మహిమలూరు, అప్పారావుపాళెం, నాగులపాడు, చెర్లో యడవల్లి, సాతానుపల్లి, శ్రీనివాసపురం, పమిడిపాడుల్లో కూడా అదేమాదిరిగా భవనాల నిర్మాణాలు నిలిచిపోయి ఉన్నాయని ఆయా గ్రామాల వారు చెబుతుండేవారు. అప్పట్లో ఒక్కో భవనానికి 7లక్షల రూపాయలవంతున మంజూరు కాగా శ్లాబ్‌లెవల్ వరకు నిర్మించి వదిలేశారని చెబుతుండేవారు. ఆత్మకూరులో పలు భవనాల పరిస్థితి చూస్తే అత్యంత విడ్డూరంగా, విచిత్రంగా ఉంటుంది. 9సంవత్సరాలుగా ఆర్అండ్‌బి అతిథిగృహం భవనం, ఐదేళ్ళుగా ఆర్డీవో, తహశిల్దారు కార్యాలయాల భవనాల నిర్మాణాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. సాతానుపల్లి వద్ద నిర్మించిన పాఠశాల భవనం, కమ్యునిటిహాల్ నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. మహిమలూరులో డ్వాక్రా భవనం 12సంవత్సరాలుగా శ్లాబ్‌లెవల్‌లో దర్శనమిస్తోంది. ఈవిషయమై అధికారులతో మేజర్‌న్యూస్ మాట్లాడగా ప్రాజెక్ట్ పరిధిలో దాదాపు 20 భవనాలు ఇలాగే ఉన్నాయని, నిధులు కొరతతో పనులు నిలిపివేవామని తెలుపగా తమవంతుగా ఏయి ద్వారా ఏఏ భవనానికి ఎంత నిధులు అవసరమో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, ఇంకా నిధులు మంజూరు కాలేదని వారు పేర్కొన్నారు. మరి జిల్లా అధికారులు స్పందించి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటారేమో చూడాల్సి ఉంది.

# కనీసవసతులు కరువైన అధునాతన బస్టాండు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో అధునాతనంగా నిర్మించిన ఎంజిఆర్ మున్సిపల్ బస్టాండులో కనీస వసతులు కరువయ్యాయని ప్రయాణీకులు వాపోతున్నారు. గతంలో ఉన్న బస్టాండును తొలగించడంతో రెండేళ్ళపాటు జనాలు ఎండ,వానలో తీవ్రంగా ఇబ్బందిపడుతూ దుకాణాలపంచన పడిగాపులుంటుండేవారు. ఏడాదిన్నర క్రితం శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి తన అన్న దివంగత మేకపాటి గౌతంరెడ్డి పేరుతో ఏర్పాటుచేసి ఎంజిఆర్ ఫౌండేషన్ ద్వారా సొంత నిధులు వెచ్చించి దాదాపు 4కోట్ల రూపాయల వ్యయంతో అధునాతన బస్టాండును నిర్మించి ఏడాది క్రితం మంత్రుల చేతులమీదుగా ప్రారంభించారు. కాగా నిత్యం రద్దీగా వందలాదిమంది ప్రయాణీకుల తాకిడి ఉన్న ఈ బస్టాండులో కేవలం 32మంది కూర్చునేందుకు మాత్రమే కుర్చీలు ఏర్పాటు చేయగా మిగతావారు నేలమీద కూర్చుంటూ బస్సులకోసం వేచి ఉంటూ ఇబ్బందిపడుతున్నారు. ఫ్యాన్లు లేనందున ఇబ్బందిగా ఉందని, తాగునీటి సౌకర్యం లేదని, అక్కడ నిర్మించిన గదుల్లో దుకాణాలు కూడా సక్రమంగా ప్రారంభించనందున కనీస అవసరాలు తీరే పరిస్థితి లేదని కూడా పలువురు ప్రయాణీకులు తీవ్ర ఆవేదనతో చెబుతున్నారు. పరిస్థితిని గమనించిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తాగునీటి సౌకర్యం కల్పించారు. టిఫిన్, భోజన హోటల్ సౌకర్యం లేదు.బస్టాండును అధునాతనంగా నిర్మించినా కనీస వసతులు కల్పించనవసరం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ వసతులను మున్సిపాలిటీ వారు సమకూర్చాలా, ఆర్టీసీ వారు సమకూర్చాలా, ఎంజిఆర్ ట్రస్ట్ వారు సమకూర్చాలా అని కూడా పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు వెంటనే చొరవచూపి బస్టాండులో కనీసవసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

# గుంతలమయమైన మురుగుళ్ళ రోడ్డు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని మురుగుళ్ళకు వెళ్ళే రహదారి అత్యంత అధ్వాన్నంగా ఉంది. నల్లపురెడ్డిపల్లి నుండి మురుగుళ్ళ వరకు ఉన్న 3కిలోమీటర్ల రహదారి అడుగడుగునా దెబ్బతిని, గుంటలు పడి ప్రజలకు అవస్థగా ఉంది. ఈరోడ్డపై మురుగుళ్ళ, కనుపూరుపల్లి గ్రామాల వారు రాకపోకలు సాగించాల్సి ఉంది. మురుగుళ్ళలో గ్రామసచివాలయం ఉండడంతో ఆరెండు గ్రామాలతోపాటు ఆపరిధిలోని బండారుపల్లి గ్రామస్థులు కూడా రాకపోకలు సాగించాల్సి ఉంది. రోడ్డు గుంటలమయమై పరమ అధ్వాన్నంగా ఉండగా అందరూ అవస్థలు పడుతున్నారు. తీవ్ర అసౌకర్యంగా ఉందని వాపోతున్నారు. ద్విచక్రవాహనకారులు కూడా మరింతగా ఇబ్బందిపడుతున్నామని చెబుతున్నారు. ముదనష్టంగా ఉన్న ఈరోడ్డుపై తమ అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని చెబుతున్నారు. నిత్యం ఈరోడ్డును చూస్తుండే పాలకులుకానీ, తరచూ సచివాలయానికి విచ్చేస్తుండే అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు చినుకులుపడినా ఈరోడ్డు దయనీయంగా ఉంటుందని, ద్విచక్రవాహనకారులు మరింతగా ఇబ్బంది పడుతున్నారని, ఆటోల్లో వెళ్ళ ప్రయాణీకులు ప్రసవవేదన అనుభవిస్తున్నారని, నరకయాతనగా ఉంటుందని గ్రామస్థులు తీవ్ర ఆవేదనతో చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని, రోడ్డుకు మరమ్మత్తులు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## మలుపులవద్ద ఆందోళనకరంగా చెట్లు



నువ్వురుపాడు సమీపంలో రోడ్డు మలుపు వద్ద కమ్ముకున్న చెట్లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు సోమశిల మార్గంలో రహదారి మలుపుల వద్ద చెట్లు ఆందోళనకరంగా ఉన్నాయని వాహనకారులు వాపోతున్నారు. రోడ్డుకిరువైపులా చెట్లు బాగా పెరిగి ఉన్నందున మలుపుల వద్ద ఎదురు వచ్చే వాహనాలు కన్పించకుండా అకస్మాత్తుగా వస్తుంటాయని, దాంతో ప్రమాదాలు జరుగుతుంటాయని వాహనకారులు, ప్రధానంగా ద్విచక్రవాహనకారులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలను గురించి సంబంధిత అధికారులు పట్టించకునే పరిస్థితి లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారని వాహనకారులు ఆవేదనతో చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగే చెట్లను తరచూ తొలగించాలని, మలుపుల వద్ద వెంటనే వాటి కొమ్మలు కొట్టి ప్రమాదకర పరిస్థితులను తప్పించాలని వాహనకారులు కోరుతున్నారు. ఇలాంటి సమస్యలు కూడా ఎవరో ఒకరు చెప్పేంతవరకు అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదా అని పలువురు వాహనకారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## రక్షణకరువైన ఐసీడీఎస్ కార్యాలయం



ప్రహరిలేని ఐసీడీఎస్ కార్యాలయం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఐసీడీఎస్ కార్యాలయ భవనాలకు రక్షణ కరువైంది. అక్కడ పనిచేసే వారికి అసౌకర్యంగా ఉంటోంది. నెల్లూరు-ముంబాయి రహదారిపై నెల్లూరుపాళెం వద్ద ఐసిడిఎస్ కార్యాలయ పక్కా భవనాలను నిర్మించి గత ఏడాది ప్రారంభించారు. సిడిపివో ఆధ్వర్యంలో సూపర్ వైజర్లు, సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తుంటారు. తరచూ ఈప్రాజెక్టు పరిధిలోని ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే ఈభవనాలకు చుట్టూరా ప్రహరీగోడ నిర్మించనందున నిత్యం పశువులు, గొర్రెలు, మేకలు విచ్చలవిడిగా సంచరిస్తుంటాయి. చుట్టూరా కంపచెట్లు ఉండడం, ప్రహరీలేనందున విషజంతువుల సంచారం కూడా ఉంటుంది. ఆవరణ చదునులేక, కనీసం అనుసంధాన రహదారిని పటిష్టంగా నిర్మించనందున ఇబ్బందికరంగా ఉంటోంది. ఉన్నతాధికారులు ఈపరిస్థితిని గమనించి వెంటనే ఈకార్యాలయ భవనాలకు ప్రహరీగోడ నిర్మించాల్సిన అవసరం, ఆవరణ చదునుచేసి, అనుసంధానరహదారిని చక్కబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఏఎస్‌పేట క్రాస్‌రోడ్ వద్ద షెల్టరు నిర్మించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఆత్మకూరు సమీపంలోని ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద ఒక బస్‌షెల్టరు నిర్మించాలని జనాలు పదేపదే కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఏఎస్‌పేటలో శ్రీశ్రీశ్రీ ఖాజారహమతుల్లా నాయబ్‌రసూల్ దర్గా ఉండడంతో ప్రముఖ యాత్రాకేంద్రంగా ఉంటూ ప్రతి శుక్రవారం వందలాదిగా ఏడాదికొకదపా జరిగే గంధమహోత్సవం సందర్భంగా లక్షలాది మంది ప్రయాణీకులు విచ్చేస్తుంటారు. అదీగాక మండల కేంద్రం కావడంతో గ్రామాల నుండి పలువురు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అది కూడలి కావడంతో బస్సులు మారే ప్రయాణీకులు అక్కడ వేచి ఉండేందుకు బస్‌షెల్టరు అత్యంతావశ్యకం కాగా పదేపదే ప్రయాణీకులు కోరుతూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన, మండలకేంద్రమైన ఏఎస్‌పేటకు రాకపోకలు సాగించే ప్రయాణీకుల కోసం ఒక బస్‌షెల్టరు నిర్మించేందుకు ప్రాధాన్యతాక్రమంలో సంబంధిత అధికారులు స్పందించాలని, చర్యలు తీసుకోవాలని వివిద ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు కోరుకుంటున్నారు.

క్యాన్సర్ గురించి తెలుసుకుందాం..

# మనల్ని మనం కాపాడుకుందాం..

▶ కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**నెల్లూరు (వైద్యం), మేజర్‌న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పీహెచ్‌పీ నాయకులు మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, మున్సిపల్ పాఠశాలలందు క్యాన్సర్ కారణాలు, పర్యావరణ కాలుష్యం, ప్లాస్టిక్ వాడకంవల్ల నష్టాలు గురించి అవగాహన కల్పించుటకు, ర్యాలీలు నిర్వహించుటకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం క్యాన్సర్ గురించి తెలుసుకుందాం - మనల్ని మనం కాపాడుకుందాం కొన్ని క్యాన్సర్ల కారణాలు, వాటి లక్షణాలు, ప్లాస్టిక్ వాడకం వల్ల నష్టాలు అనే కరపత్రికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న పి.ఎం.పి, ఆర్.ఎం.పి, గ్రామీణ వైద్యులు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్య పరచాలని, చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధుల పట్ల ఎవరైనా మీవద్దకు వస్తే ప్రాథమిక చికిత్స అందించి దగ్గరలోని పీహెచ్‌సీ, జీజీహెచ్‌కి పంపించాలని, గ్రామీణ వైద్యులు ఎవరు కూడా పరిధికి మించి వైద్యం చేయరాదని, చట్టాలను గౌరవిస్తూ, ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ, గ్రామీణ ప్రజల ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా పీహెచ్‌పీ నాయకులు కలెక్టర్ ను శాలువా, పూలమొక్కతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, నరసాపురం ప్రసాద్, ఉప్పలపాటి రామదాసు, బైరి శంకర్రావు పాల్గొన్నారు.




సూర్య రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, మనుబోలు, కొడవలూరు, కోవూరు, రాపూరు, ఇందుకూరుపేటలలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1, LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు. సెల్: 9000 118811


## సీఎంని కలిసిన కావలి ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అమరావతిలో కలిశారు. కావలి నియోజక వర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. అమృత పథకం పనులకు శ్రీకారం చుట్టామని ప్రారంభో త్సవ కార్యక్రమానికి రావాల్సిం దిగా ఆహ్వానించారు. కావలిలో జరగబోతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. అలాగే కావలి తుమ్మలపెంటరోడ్డు, రాజుపాలెం, ఇసుకపల్లి రోడ్డు, దగదర్తి బుచ్చిరెడ్డి పనుల వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి తెలియజేశారు. అంతేకాకుండా దామవరం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కావలి నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# వైయస్సార్ విగ్రహం అరుగు ధ్వంసం



▶ మర్రిపాడు ఎంపీపీ భర్త స్టేషన్‌లో ఫిర్యాదు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండల కేంద్రంలో వున్న వైస్సార్ విగ్రహం చుట్టూ వున్న గ్రానైట్ అరుగు తొలగింపు, విగ్రహం డామేజ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకువాలని మర్రిపాడు ఎంపీపీ భర్త గంగవరపు శ్రీనివాసులు నాయుడు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మర్రిపాడు సెంటర్ యందు వున్న వైస్సార్ విగ్రహం చుట్టూ వున్న గ్రానైట్ అరుగును నిన్న 27వ రాత్రి జేసీబీతో తీసివేసి, వైస్సార్ విగ్రహం డామేజ్ కావడానికి కారకులైన వారిని విచారించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డికి ఆదేశాలతో మర్రిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వైస్సార్సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనువాసులు నాయుడు, వైస్సార్సీపీ మండల యువజన అధ్యక్షులు చంద్ర నారాయణస్వామి, బొర్రె విష్ణు, విజయ్‌కుమార్, కత్తి పద్మారావు తదితరులు ఈ సందర్భంగా గంగవరపు శ్రీనువాసులు నాయుడు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్రిపాడుకి వస్తున్నారని, నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేసి, ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పని చేస్తుంది

▶ కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ స్విచ్ ఆన్ చేసి ఎడమ కాలువకు నీటిని వదిలిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

▶ గతం ప్రభుత్వంలో మరుగున పడిన వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖను ప్రక్షాళన చేస్తున్నాం

▶ సాగునీరు, త్రాగునీరుకు ఈ ప్రభుత్వంలో డోకా ఉండదు : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖను ప్రక్షాళన చేస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రైతుల కోరిక మేరకు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ మోటర్ల స్విచ్ ఆన్ చేసి ఎడమ కాలవ ద్వారా నీరు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు ఎడమ కాలువ లిఫ్టును 2014లో తమ ప్రభుత్వం రూ.61 కోట్లతో ఆనాటి సీఎం చంద్రబాబు ద్వారా ప్రారంభించిందని 2017 నుంచి 2019 వరకు 3.2 టీఎంసీలు నీరు వదిలినట్లు తెలిపారు. అయితే గత ప్రభుత్వం కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు కనీసం కరెంటు బిల్లులు కట్టలేక లిఫ్టును మూలపడేసిందన్నారు. అప్పటి ఇన్‌చార్జ్ జిల్లా మంత్రి అంబటి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి ఇద్దరూ కలిసి జిల్లాలో రైతులను సాగునీటికి, త్రాగునీటికి ఇబ్బందులు పడేలా చేశారన్నారు. మాజీ మంత్రి అప్పటిలో కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటి కోసం ఆరు గ్రామాల రైతులు ధర్నా చేసిన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాకాణి హయంలో వ్యవసాయ శాఖ పూర్తిగా మూతపడిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు వస్తుందని చెప్పుకొచ్చిన వారు, ఇప్పుడు జలాశయాలు ఒక్కొక్కటిగా నిండుతుండడంతో వారికి నిద్ర పట్టడం లేదన్నారు. సోమశిల, కండలేరు ఈ ఏడాది నిండుకుంటాయని, కండలేరు ఆయకట్టు కింద రైతులకు మొదటి పంటకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. మాజీ మంత్రి గత ఐదేళ్ళు మండలంలో దక్షిణ కాలువ పనులు ఆపేసారని, అలాగే దేగపూడి - బండేపల్లి కాలువ పనులు నిలిచిపోయాని, ఆగిన పనులను తాను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.కాకాణి జనం కోసం కాకుండా ధనం కోసం బ్రతికారన్నారు. కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్ ద్వారా నీరు వదిలడంతో అధికారంగా పొదలకూరు, చేజర్ల, సైదాపురం, మనుబోలు, వెంకటాచలం, నెల్లూరు రూరల్, మండలాల్లోని 20,400 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. 2050 హెచ్పి పవర్ కలిగిన రెండు మోటర్లు 260 క్యూసెక్కుల నీటిని పంప్ చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఎస్ఈ వెంకటరమణారెడ్డి, కండలేరు డ్యాం ఈఈ పి.విజయ భాస్కర్ రెడ్డి, కండలేరు లిఫ్ట్ ఈఈ ఎం.అనిల్ కుమార్ రెడ్డి,డీ.ఈఈ విజయ రామిరెడ్డి, ప్రసూన టిడిపి నాయకులు తలచీరు మస్తాన్ బాబు, నువ్వుల వెంకట్, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, అక్కెం సుధాకర్ రెడ్డి, నెల్లెటం పెంచలయ్య, పులిపాటి వెంకటరత్నం నాయుడు, కోవూరు. బక్కయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.